

## త్రిష, ధృతిని స్ఫూర్తిగా తీసుకోవాలి

- హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఐసీసీ మహిళల అండర్-19 టీ20 వరల్డ్ కప్‌నకు ఎంపికైన తెలంగాణ క్రికెటర్లు గొంగడి త్రిష, కేసరి ధృతిని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఘనంగా సన్మానించింది. ఉప్పల్ స్టేడియంలో హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్‌రావు ఈ ఇరువురిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మక వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీకి ఇద్దరు తెలంగాణ క్రికెటర్లు ఎంపికవడం గర్వంగా ఉందన్నారు. వీళ్లు ఈ స్థాయికి చేరుకోవడానికి వారి తల్లిదండ్రులు, కోచ్‌లు పడిన శ్రమ మాటల్లో చెప్పలేనిదన్నారు. వర్ధమాన క్రికెటర్లు వీరిని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. జాతీయ జట్టుతో పాటు మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో మరింత మంది తెలంగాణ క్రికెటర్లు ప్రాతినిధ్యం వహించేలా తమ కార్యవర్గం కృషి చేస్తోందని జగన్‌మోహన్‌రావు తెలిపారు.

## తనూజకు హ్యాట్రిక్ స్వర్ణాలు

- ముగిసిన తెలంగాణ రాష్ట్ర సెయిలింగ్ చాంపియన్‌షిప్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: నగరంలోని హుస్సేన్‌సాగర్‌లో నాలుగు రోజుల పాటు అలరించిన తెలంగాణ రాష్ట్ర సెయిలింగ్ చాంపియన్‌షిప్ ఘనంగా ముగిసింది. హైదరాబాద్‌లోని ఉద్భవ్ పాఠశాలలో చదువుతున్న తనూజ కామేశ్వర్, దీక్షిత కొమురవెల్లి పతకాల మోత మోగించారు. టోర్నీలో తనూజ.. మూడు స్వర్ణాలతో హ్యాట్రిక్ మెడల్స్ సాధించగా దీక్షిత ఓ స్వర్ణం, రెండు రజతాలు, కాంస్యం దక్కించుకుంది.

# నిలువరించారు.. నిలుస్తారా?

భారత్ ఎదుట భారీ లక్ష్యం

రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ 228/9

## కంగారూల ఆధిక్యం 333

### మెరిసిన బుమ్రా, సిరాజ్



బుమ్రా (4/56)

మెల్‌బోర్న్: జస్‌ప్రీత్ బుమ్రా వర్సెస్ ఆస్ట్రేలియాగా సాగుతున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ)లో భారత పేసర్ మరోసారి అద్భుత స్పెల్‌తో మ్యాజిక్ చేయడంతో బాక్సింగ్ డే టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో కంగారూలు తోకముడిచారు. బుమ్రా (4/56) మరోసారి విజృంభించగా మహ్మద్ సిరాజ్ (3/66) కూడా అతడికి అండగా నిలవడంతో రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 228/9 పరుగులు చేసింది. ప్రస్తుతం ఆ జట్టు ఆధిక్యం 333 పరుగులుగా ఉంది. టాపార్డర్, మిడిలార్డర్ పనిపట్టిన బౌలర్లు.. ఆఖరి వరుస బ్యాటర్లు నాథన్ లియాన్ (54 బంతుల్లో 41 నాటౌట్, 5 ఫోర్లు), స్కాట్ బొలాండ్ (65 బంతుల్లో 10 నాటౌట్, 1 ఫోర్) వికెట్ తీయలేక చతికిలపడ్డారు. ఈ ఇద్దరూ పదో వికెట్‌కు అజేయంగా 55 పరుగులు జోడించి ఆసీస్ ఆధిక్యాన్ని 330 పరుగుల మార్కును దాటించారు. ఆట ఆఖరిరోజైన సోమవారం ఈ ఇద్దరినీ త్వరగా ఔట్ చేసి ఛేదనను భారత్ ఏ మేరకు విజయవంతం చేయగలుగుతుందనేది ఆసక్తికరం. 2021లో ఇదే కంగారూలతో ప్రఖ్యాత గబ్బా వేదికగా జరిగిన చివరి టెస్టులో 329 పరుగులను ఛేదించి సిరీస్‌ను దక్కించుకున్న భారత్.. ఆ మ్యాజిక్‌ను రీక్రియేట్ చేస్తే మెల్‌బోర్న్ మన సొంతమవడం పక్కా! కానీ నాలుగో రోజు ఆటలో బంతి శరీరం మీదకు దూసుకురావడం, పిచ్‌పై అస్థిరమైన బౌన్స్‌తో చివరి రోజు ఆసీస్ పేస్ దళం నుంచి భారత బ్యాటర్లకు తిప్పలు తప్పకపోవచ్చు.

**బుమ్రా.. తగ్గేదేలే!**

140.4-38-384-29.. మరో మ్యాచ్ మిగిలున్న బీజీటీలో బుమ్రా బౌలింగ్ గణాంకాలివి. అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో బుమ్రా దరిదాపుల్లో కూడా (17 వికెట్లతో కమిన్స్ రెండో స్థానం) ఏ బౌలర్ లేడు. సిరీస్ ఆరంభం నుంచి కంగారూలను ముప్పు తిప్పలు పెడుతున్న ఈ పేసు గుర్రం.. రెండో ఇన్నింగ్స్‌లోనూ హడలెత్తించాడు. నాలుగో రోజు ఆటలో ఓవర్ నైట్ స్కోరు 358/9కు మరో 11 పరుగులు జోడించి (369) భారత్ ఆలౌట్ అవగా తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్‌కు 105 రన్స్ ఆధిక్యం దక్కింది. మూడో రోజు సెంచరీ హీరో నితీశ్ రెడ్డి (114)ని లియాన్ ఔట్ చేసి భారత ఇన్నింగ్స్‌కు తెరదించాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన ఆసీస్ ఏడో ఓవర్లోనే తొలి వికెట్ కోల్పోయింది. తొలి ఇన్నింగ్స్‌లో మెరుపులు మెరిపించిన ఓపెనర్ సామ్ కొన్‌స్టాస్ (8)ను బుమ్రా ఈసారి ఎక్కువసేపు క్రీజులో నిలువనీయలేదు. బుమ్రా వేసిన బంతిని డిఫెన్స్ ఆడబోయిన కొన్‌స్టాస్.. అది కాస్తా మిస్ అవడంతో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. కొద్దిసేపు విసిగించిన ఉస్మాన్ ఖవాజా (21)ను సిరాజ్ బౌల్డ్ చేశాడు. లంచ్ తర్వాత ఫస్ట్ ఇన్నింగ్స్ సెంచరీ హీరో స్టీవ్ స్మిత్ (13) సైతం సిరాజ్ బౌలింగ్‌లోనే పంత్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత వరుస ఓవర్లో బుమ్రా ఆసీస్ మిడిలార్డర్ పనిపట్టాడు. 34వ ఓవర్ రెండో బంతికి ప్రమాదకర హెడ్ (1)ను వెనక్కిపంపిన అతడు.. ఆరో బంతికి మిచెల్ మార్ష్ (0)నూ ఔట్ చేశాడు. అదే ఊపులో తన తర్వాతి ఓవర్లో అలెక్స్ కేరీ (2)నూ బౌల్డ్ చేయడంతో ఆసీస్ 91/6తో నిలిచింది.

**ఆదుకున్న లబూషేన్, కమిన్స్**

భారత బౌలర్ల జోరుతో ఆసీస్ 150 పరుగుల లోపే ఆలౌట్ అవుతుందని భావించినా లబూషేన్ (139 బంతుల్లో 70, 3 ఫోర్లు) మరో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కెప్టెన్ పాట్ కమిన్స్ (41) అండగా అతడు భారత బౌలర్లను విసిగించాడు. సుమారు 20 ఓవర్ల పాటు వికెట్‌ను కాపాడుకున్న ఈ ద్వయం ఏడో వికెట్‌కు విలువైన 57 పరుగులు జోడించింది. ఈ క్రమంలో వీరిద్దరూ ఇచ్చిన క్యాచ్‌లను గల్లీలో యశస్వీ జైస్వాల్ వదిలేయడం భారత్‌ను దెబ్బకొట్టింది. అర్ధ సెంచరీ పూర్తిచేసి ప్రమాదకరంగా మారుతున్న లబూషేన్‌ను ఎట్టకేలకు సిరాజ్.. టీ విరామం తర్వాత వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది. మిచెల్ స్టార్క్ (5) పంత్ త్రోకు రనౌట్ అవగా కమిన్స్‌ను జడేజా వెనక్కిపంపాడు.

**పట్టు విడిచారు..**

ప్రధాన బ్యాటర్లందరినీ త్వరగానే వెనక్కిపంపిన భారత బౌలర్లు ఆఖర్లో పట్టు విడిచారు. లియాన్, బొలాండ్ క్రీజులోకి వచ్చేసరికి ఆసీస్ ఆధిక్యం 278 పరుగులు. కానీ ఈ ఇద్దరూ పట్టుదలతో ఆడి ఆతిథ్య జట్టు ఆధిక్యాన్ని మరింత పెంచారు. వీరిని ఔట్ చేసేందుకు రోహిత్.. బౌలర్లను మార్చినా అనవసర షాట్లకు పోకుండా ఈ ఇద్దరూ జాగ్రత్త పడ్డారు. కొత్తబంతి తీసుకున్నాక బుమ్రా బౌలింగ్‌లో లియాన్.. స్లిప్స్‌లో క్యాచ్ ఇచ్చినా అది నోబాల్‌గా తేలడంతో అతడు బతికిపోయాడు.



లబూషేన్ (70)

**సంక్షిప్త స్కోర్లు**

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 474 ఆలౌట్ భారత్ తొలి ఇన్నింగ్స్: 369 ఆలౌట్ ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 82 ఓవర్లలో 228/9 (లబూషేన్ 70, లియాన్ 41 నాటౌట్, బుమ్రా 4/56, సిరాజ్ 3/66)

### బుమ్రా @200

టెస్టులలో బుమ్రా మరో ఘనతను అందుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో హెడ్‌ను ఔట్ చేసిన తర్వాత అతడు టెస్టులలో 200 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు. తన కెరీర్‌లో 44వ టెస్టు ఆడుతున్న బుమ్రా.. అంతర్జాతీయ టెస్టులలో కనీసం 200 వికెట్లు తీసి సగటు 20 కంటే తక్కువ కలిగిన బౌలర్లలో మొదటివాడుగా నిలిచాడు. విండీస్ దిగ్గజాలు మాల్కమ్ మార్షల్ (20.94), జోయల్ గార్నర్ (20.97) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. బంతుల పరంగా చూస్తే వకార్ యూనిస్ (7,725), డేల్ స్టెయిన్ (7,848), రబాడా (8,154) తర్వాత బుమ్రా (8,484) నాలుగో స్థానంలో ఉన్నాడు. భారత్ తరపున టెస్టులలో 200 వికెట్ల మైలురాయిని దాటినవారిలో బుమ్రా 12 బౌలర్ కాగా అత్యంత వేగంగా ఈ ఘనత సాధించినవారిలో అశ్విన్ (37 టెస్టులలో) తర్వాత జడేజా(44)తో రెండో స్థానంలో సమానంగా నిలిచాడు.

## వరల్డ్ ర్యాపిడ్ చెస్ విజేత హంపి



న్యూయార్క్: భారత స్టార్ చెస్ క్రీడాకారిణి, గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి వరల్డ్ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. టోర్నీలో 11 పాయింట్లకు గాను ఆమె 8.5 పాయింట్లు సాధించి అగ్రస్థానాన్ని దక్కించుకోవడంతో విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన 11వ రౌండ్‌లో హంపి.. ఇరెనె సుకందర్ (ఇండోనేషియా)ను ఓడించడంతో టైటిల్ నెగ్గింది. ఈ టోర్నీని గెలుచుకోవడం హంపికి ఇది రెండోసారి. 2019లో జార్జియాలో నిర్వహించిన టోర్నీలోనూ హంపి సత్తా చాటింది. తద్వారా వరల్డ్ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌ను ఒకటి కంటే ఎక్కువసార్లు గెలిచిన ప్లేయర్లలో చైనా క్రీడాకారిణి జు వెంజున్ తర్వాతి స్థానంలో నిలిచింది. తొలి గేమ్‌లో ఓడిపోయినప్పటికీ హంపి తర్వాత పుంజుకుని టైటిల్‌ను దక్కించుకుంది. భారత్ నుంచి ద్రోణవల్లి హారిక (8 పాయింట్లు) ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. ఇదే టోర్నీ పురుషుల విభాగంలో రష్యాకు చెందిన 18 ఏండ్ల కుర్రాడు వోలోదర్ ముర్జిన్ టైటిల్ గెలిచాడు. 10 పాయింట్లతో అతడు చాంపియన్‌గా అవతరించాడు. ఆరంభంలో వరుస విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన యువ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి ఆఖర్లో తడబడి 9 పాయింట్లతో ఐదో స్థానంతో సంతృప్తి పడాల్సి వచ్చింది.

## హర్యానాదే ట్రోఫీ

**పీకేఎల్ ఫైనల్‌లో పాట్నా పైరేట్స్‌పై గెలుపు**



పూణె: ప్రో కబడ్డీ లీగ్-11వ సీజన్ టైటిల్‌ను హర్యానా స్టీలర్స్ దక్కించుకుంది. సీజన్ ఆరంభం నుంచి టేబుల్ టాపర్‌గా ఉంటూ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఫైనల్ చేరిన ఆ జట్టు.. టైటిల్ పోరులో 32-23తో పాట్నా పైరేట్స్‌ను మట్టికరిపించి ఈ టోర్నీలో తొలిసారి ట్రోఫీని సాధించింది. గతేడాది ఫైనల్‌లో పూణెరి పల్టన్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచిన హర్యానా ఈసారి మాత్రం పట్టు విడవకుండా టోర్నీ ఆసాంతం అదరగొట్టి తమ కప్ కలను సొంతం చేసుకుంది. తొలి అర్ధ భాగం ముగిసేసరికి 15-12తో ఆధిక్యంలో ఉన్న హర్యానా.. సెకండాఫ్‌లో మరింత జోరు పెంచింది. హర్యానా తరపున రైడర్ శివమ్ పటారె 9 పాయింట్లతో సత్తా చాటగా ఆల్‌రౌండర్ షాద్లోయ్ (7), వినయ్ (6) ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

## డబ్ల్యూటీసీ ఫైనల్‌కు దక్షిణాఫ్రికా

**తొలి టెస్టులో పాక్‌పై ఉత్కంఠ విజయం**



సెంచూరియన్: వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2023-25 సైకిల్‌లో దక్షిణాఫ్రికా ఫైనల్ చేరింది. స్వదేశంలో పాకిస్థాన్‌తో జరిగిన తొలి టెస్టులో సఫారీలు థ్రిల్లింగ్ విక్టరీ సాధించి ఈ టోర్నీలో సగర్వంగా ఫైనల్ పోరుకు అర్హత సాధించారు. సెంచూరియన్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో 148 పరుగుల ఛేదనలో భాగంగా ఓవర్ నైట్ స్కోరు 27/3తో ఐదో రోజు ఆట ఆరంభించిన సౌతాఫ్రికా.. ఒకదశలో 95/4తో పటిష్ఠ స్థితిలోనే నిలిచింది. కానీ ఐదు పరుగుల వ్యవధిలో ఆ జట్టు ఏకంగా 4 వికెట్లు కోల్పోవడంతో ఒక్కసారిగా పాకిస్థాన్ గెలుపు రేసులోకి వచ్చింది. మహ్మద్ అబ్బాస్ (6/54) అద్భుత బౌలింగ్‌తో సఫారీలను ఆందోళనకు గురిచేశాడు. కానీ లోయరార్డర్‌లో అనుభవజ్ఞుడైన కగిసొ రబాడా (26 బంతుల్లో 31 నాటౌట్, 5 ఫోర్లు), మార్కో యాన్సెన్ (24 బంతుల్లో 16 నాటౌట్, 3 ఫోర్లు) దక్షిణాఫ్రికాను (150/8) విజయతీరాలకు చేర్చారు. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అర్హత సాధించడం ఆ జట్టుకు ఇదే తొలిసారి. ఈ సైకిల్‌లో మరో మ్యాచ్ ఆడాల్సి ఉన్నప్పటికీ బవుమా సేన.. 66.67 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. సఫారీలు లార్డ్స్‌కు టికెట్ బుక్ చేసుకున్న నేపథ్యంలో రెండో జట్టు ఏదని సర్వత్రా ఆసక్తి నెలకొంది. పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా (58.89 శాతం), భారత్ (55.88 శాతం) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి.

## ఈ ఈవెంట్‌తో చరిత్ర సృష్టిద్దాం..





'గేమ్‌ఛేంజర్' ప్రమోషన్స్ విషయంలో ఇప్పటివరకూ నార్మల్ స్పీడ్‌తో వెళుతున్న నిర్మాత దిల్‌రాజు గేర్ మార్చారు. రీసెంట్‌గా అమెరికా డల్లాస్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించిన ఆయన.. తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించనున్న ఈవెంట్‌పై తర్జనభర్జన పడుతున్నారు. ఈ విషయాన్ని ఫైనల్ చేసేందుకు ఆదివారం ఆయన విజయవాడ చేరుకున్నారు. అక్కడి బృందావన కాలని, వజ్రా మైదానంలో ఏర్పాటు చేసిన 256 అడుగుల 'గేమ్‌ఛేంజర్' రామ్‌చరణ్ కటౌట్‌ని ఆవిష్కరించిన దిల్‌రాజు.. ఫ్యాన్స్‌తో మాట్లాడారు. 'ఈ కటౌట్‌తో రికార్డ్ నెలకొల్పిన మెగా ఫ్యాన్స్‌కి ధన్యవాదాలు. సుప్రీంహీరో చిరంజీవితో మొదలైన మీ అభిమానం ఆయన కుటుంబంపై కూడా ప్రసరిస్తూనే ఉంది. ఒక్కరే బాస్.. ఆయనే మెగాస్టార్. మనందరికీ ఓ పవర్‌స్టార్‌నీ, మెగా పవర్‌స్టార్‌ని అందించడంతోపాటు అల్లు అర్జున్, వరుణ్‌తేజ్, సాయిదుర్గతేజ్ తదితరులను ఇచ్చారాయన. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గారిని కలిసేందుకే ఇక్కడకు వచ్చాను. ఆయన ఆధ్వర్యంలోనే వేడుక జరిగితే బావుంటుందనేది మా అభిప్రాయం. ఆయన డేట్‌ని బట్టి ఈవెంట్ ఎక్కడో నిర్ణయిస్తాం. ఈ ఈవెంట్‌తో చరిత్ర సృష్టిద్దాం' అని తెలిపారు దిల్‌రాజు. చిరంజీవి ఈరోజే సినిమా చూశారని, మెగాహిట్ కొట్టబోతున్నామని ఫోన్ చేసి అభినందించారని, ఈ సందర్భంగా దర్శకుడు శంకర్‌ని ఆయన అభినందించారని, జనవరి 1న ట్రైలర్ విడుదల చేస్తామని దిల్‌రాజు చెప్పారు. తన సంస్థ నుంచి వస్తున్న ఈ 50వ సినిమా.. చరిత్రలో నిలుస్తుందని దిల్‌రాజు నమ్మకం వెలిబుచ్చారు. జనవరి 10న సంక్రాంతి కానుకగా సినిమా విడుదల అవుతున్న విషయం తెలిసిందే.

## కృష్ణుడ్ని చూపించండి డైరెక్టర్‌గారూ..



**'కల్కి 2898ఏడీ'** సీక్వెల్ కోసం ప్రేక్షకులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో దర్శకుడు నాగ్‌అశ్విన్ చెప్పిన విశేషాలు ఆ సినిమాపై ఆసక్తిని మరింత పెంచేస్తున్నాయి. ఒకవేళ 'కల్కి' సీక్వెల్‌లో కృష్ణుని పాత్రను చూపించాలనుకుంటే.. మీరు ఏ హీరోని ఎంపిక చేస్తారు? అనే ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ.. 'అసలు 'కల్కి' యూనివర్స్‌లో కృష్ణ పాత్రధారి ముఖాన్ని రివీల్ చేయకూడదనే నేను నిర్ణయించాను. ఒకవేళ పూర్తిస్థాయిలో కృష్ణుడ్ని చూపించాలనుకుంటే.. మహేష్‌బాబు అయితే కరెక్ట్. కృష్ణుడిగా ఆయన కనిపిస్తే అభిమానులు పండగ చేసుకుంటారు. టీజర్ రిలీజ్‌కు ముందే సినిమా ఆల్‌టైమ్ బ్లాక్‌బస్టర్‌గా నిలుస్తుంది. 'ఖలేజా'లో ఆయన పోషించిన దేవుడి తరహా పాత్ర అంటే నాకు చాలా ఇష్టం.' అని చెప్పారు నాగ్‌అశ్విన్. ఈ మాటలు విన్న అభిమానులు.. 'కృష్ణుడ్ని చూపించండి డైరెక్టర్‌గారూ.. కృష్ణుడు కనిపిస్తేనే బావుంటుంది.. మహేష్‌గారిని కూడా కలవండి..' అంటూ పోస్టులు పెట్టేస్తున్నారు.

## అతీంద్రియ అంశాల ఎమోషనల్ థ్రిల్లర్



పూర్ణ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఎమోషనల్ థ్రిల్లర్ 'డార్క్ నైట్'. త్రిగుణ్ కీలక పాత్రధారి. జి.ఆర్.ఆదిత్య దర్శకుడు. సురేష్‌రెడ్డి కొవ్వూరి నిర్మాత. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. 'పూర్ణ కెరీర్‌లోనే ఉత్తమమైన నటన కనబరిచిన సినిమా ఇది. అతీంద్రియ అంశాలతో కూడిన ఊహించని మలుపులతో దర్శకుడు జి.ఆర్.ఆదిత్య చిత్రాన్ని తెరకెక్కించారు. కేవలం నాలుగు ప్రధాన పాత్రల చుట్టూ అల్లిన ఈ కథ ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తుంది.' అని నిర్మాత సురేష్‌రెడ్డి కొవ్వూరి చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: కార్తీక్ ముథుకుమార్, సంగీతం: మిస్కిన్, సహ నిర్మాతలు: శ్రీనివాస్ మేదరమెట్ల, జమ్ముల కొండలరావు, సమర్పణ: పట్లోళ్ల వెంకట్‌రెడ్డి, నిర్మాణం: P 19 ట్రాన్స్ మీడియా స్టూడియోస్.

చిత్రం

## ఘాటీలో ఘాటైన పాత్ర



కెరీర్ బిగినింగ్‌లో గ్లామర్ పాత్రల్లో ఓ వెలుగు వెలిగింది అనుష్క. అయితే.. 'అరుంధతి' తర్వాత ఆమె నుంచి రెగ్యులర్ గ్లామర్ పాత్రలు కాకుండా, అభినయానికి ఆస్కారమున్న పాత్రల్నే ఆడియన్స్ ఆశించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఆమె చేసిన వేదం, బాహుబలి ఫ్రాంచైజీ, రుద్రమదేవి, సైజ్ జీరో, భాగమతి, నిశ్శబ్దం, మిస్ శెట్టి - మిస్టర్ పోలిశెట్టి సినిమాలు ఆమెను నటిగా గౌరవప్రదమైన స్థానంలో కూర్చోబెట్టాయి. ఆ వరుసలో ఆమె చేస్తున్న మరో వైవిధ్యమైన సినిమానే 'ఘాటీ'. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఉత్తరాంధ్ర గంజాయి తోటల నేపథ్యంలో సాగే విభిన్న కథాచిత్రమని తెలుస్తున్నది.


ఇందులో అనుష్క పాత్ర ఊహలకు అతీతంగా ఉంటుందని సమాచారం. ఇటీవల విడుదలైన టీజర్‌లో.. అనుష్క బస్‌లో ఓ వ్యక్తిని మర్డర్ చేసే సన్నివేశం సినిమాపై అంచనాలు పెంచేసింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ 80 శాతం పూర్తయింది. క్లైమాక్స్ షూట్ మాత్రమే మిగిలివుంది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా నడుస్తున్నది. జనవరి చివరివారం నుంచి క్లైమాక్స్ షూట్ ఉంటుందని తెలుస్తున్నది. ఏప్రిల్ 18న చిత్రాన్ని విడుదల చేయనున్నారు. సాయిమాధవ్ బుర్రా ఈ సినిమాకు సంభాషణలు అందిస్తున్న విషయం తెలిసిందే.

## రొమాంటిక్ దిల్ రూబా..



**'క' ఘన విజయం** తర్వాత కిరణ్ అబ్బవరం నటిస్తున్న రొమాంటిక్ యాక్షన్ ఎంటర్టైనర్ 'దిల్ రూబా'. రుక్సర్ థిల్లాన్ కథానాయిక. విశ్వ కరుణ్ దర్శకుడు. రవి, జోజో జోస్, రాకేష్‌రెడ్డి, సారెగమ నిర్మాతలు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఫిబ్రవరిలో విడుదల చేయనున్నారు. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా టీజర్ రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. జనవరి 3న ఈ సినిమా టీజర్‌ను విడుదల చేయనున్నట్టు వారు తెలిపారు. 'క' విజయంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయని, దానికి తగ్గట్టే సినిమా ఉంటుందని మేకర్స్ చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: డానియేల్ విశ్వాస్, సంగీతం: సామ్ సీఎస్, నిర్మాణం: శివమ్ సెల్యులాయిడ్స్, ఏ యూడ్లీ ఫిల్మ్స్.

## తెలుగు సినిమాను శిఖరాగ్రాన నిలబెట్టిన మహానటుడు అక్కినేని -ప్రధాని నరేంద్రమోదీ





ఈ ఏడాది శతజయంతి జరుపుకున్న భారతీయ సినీ దిగ్గజం, తెలుగు తేజం నటసామ్రాట్ స్వర్గీయ అక్కినేని నాగేశ్వరరావు గురించి, ఆయన కళారంగానికి చేసిన సేవల గురించి 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రస్తావించారు. అక్కినేని తన కృషితో తెలుగు సినిమాను శిఖరాగ్రాన నిలబెట్టారని ఆయన కొనియాడారు. భారతీయ సంస్కృతి, వారసత్వ విలువలు ఆయన సినిమాల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తాయని మోదీ గుర్తుచేసుకున్నారు. ఇదిలావుంటే.. 'భారతరత్న' మినహా దేశంలోని అత్యుత్తమ పురస్కారాలన్నింటినీ అందుకున్న ఘనత అక్కినేనిది. మన్ కీ బాత్ కార్యక్రమంలో అక్కినేని ప్రస్తావనని ప్రధాని తీసుకురావడంతో అక్కినేనికి భారతరత్న కూడా ప్రకటిస్తారనే ఊహాగానాలు అభిమానుల్లో వినిపిస్తున్నాయి.

## నువ్ కొడతావ్ విజిలూ.. ప్రతి సెంటర్ పగులు..



యువహీరో విశ్వక్‌సేన్ నటిస్తున్న రొమాంటిక్ యాక్షన్ ఎంటర్టైనర్ 'లైలా'. రామ్ నారాయణ్ దర్శకుడు. సాహు గారపాటి నిర్మాత. వాలంటైన్ డే కానుకగా ఫిబ్రవరి 14న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రమోషన్స్ మొదలుపెట్టి, తొలి పాటను ఆదివారం విడుదల చేశారు. 'విజిలు విజిలు విజిలు నువ్వు కొడతావ్ విజిలూ.. పగులు పగులు పగులు ప్రతి సెంటర్ పగులూ..' అంటూ సాగే ఈ పాటను హీరో విశ్వక్‌సేన్ స్వయంగా రాయగా, లియోన్ జేమ్స్ స్వరపరిచారు. నారాయణ్ రవిశంకర్, రేష్మా శ్యామ్ ఆలపించారు. విశ్వక్‌సేన్ పోషించిన 'సోను' పాత్ర తీరుతెన్నులను ప్రజెంట్ చేస్తూ ఈ పాట సాగింది. తన ప్రత్యేకమైన స్కిల్‌తో అమ్మాయిల మనసుల్ని సోనూ ఎలా గెలుచుకుంటాడో ఈ పాట చెబుతుంది. విశ్వక్‌సేన్‌లోని ఎనర్జీ, అతని డైనమిక్ డాన్స్ మూమెంట్స్ ఈ పాటకు హైలైట్స్‌గా నిలుస్తాయని మేకర్స్ చెబుతున్నారు. ఆకాంక్ష శర్మ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి రచన: వాసుదేవ మూర్తి, కెమెరా: రిచర్డ్ ప్రసాద్, నిర్మాణం: షైన్ స్క్రీన్స్.

## మాయలో పడిపోవాల్సిందే



**'అలియాభట్** ఓ మాయ.. ఒక్కసారి ఆమెతో పనిచేస్తే ఆ మాయలో ఎవరైనా పడిపోవాల్సిందే. ఆమె ఆరా మనల్ని కూడా కమ్మేస్తుంది.' అంటున్నారు దర్శకుడు వాసన్‌బాల. ఇటీవలే అలియాతో ఆయన 'జిగ్రా' సినిమా తెరకెక్కించారు. ఫలితం ఆశించిన స్థాయిలో లేకపోయినా.. అలియాతో పనిచేశానన్న తృప్తి మాత్రం 'జిగ్రా' వల్ల లభించిందని ఆయన అన్నారు. ' 'జిగ్రా' సీరియస్ సబ్జెక్ట్. ఆ కథలో కామెడీ లేదు. కానీ సెట్ అంతా ఎప్పుడు కామెడీగా ఉండేది. కారణం అలియాభట్. తను నవ్వుతూ అందర్నీ నవ్విస్తూ ఓ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని క్రియేట్ చేయడం అలియా స్పెషాలిటీ. ఆమెతో ఒక్కసారి పనిచేశాక.. మళ్లీ ఇంకొకరితో పనిచేయడం చాలా కష్టం. ఎందుకంటే తనే గుర్తుకొస్తుంటుంది..' అంటూ మాట్లాడారు వాసన్‌బాలా. దీనిబట్టి అలియా మాయ ఏ రేంజ్‌లో ఉంటుందో అర్థంచేసుకోవచ్చు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.